# నాగమల్లెలు

**రతన్**

"అబ్బబ్బబ్బ .యీ ఆడపిల్లలతో యేంచావు వచ్చిందిరాబాబూ! వాళ్ళు పడుకోరూ ఎన్నా పడుకోనివ్వరూ!" అంటూ సూర్యంమంచం మీద లేచి ఆర్చున్నాడు ప్రక్క గదిలో ఆడ పిల్లలంతాచేరి ఇంటిపెంకు లెగిరేట్టు ఒకే నవ్వుతో గదంతా నింపేస్తున్నారు. సూర్యానికి వకవైపు నిద్ర ముంచుకొస్తూవుంది- కాని వీళ్ళ గోల మరీ జాస్తిగా వున్నందున నిద్ర పోలేక పోతున్నాడు. నిద్రకు స్వస్తిచెప్పి వక పుస్తకం విప్పాడు చదివేందుకు ఊహూ! చదువూ సాగడం లేదు వీళ్ళ నందరినీ బెదరిద్దామను కున్నాడు కాని యేం లాభం. తన బెదరింపులకు భయపడక పోగా అందరూచేరి తన్నే పెద్ద "ఫూల్" క్రింద జమ కడితే! పైగా యిది పెండ్లి జరిగే యిల్లాయిపోయె- అందులో కోపతాపాలకు తావు వుండకూడదు.

ఇక చేసేదిలేక మంచంమీదనుంచి లేచి తలు పుదగ్గరగా కుర్చీవేసుకొని వీళ్ళ సంతోషంలో యివతలినుంచే రహస్యంగాపాల్గొన్నాడు. ప్రక్క గదిలో నవ్వు లెక్కువై పోయాయి, ఆనవ్వు లోనుంచి వకగొంతు వినిపించింది, "వూరుక్కోం డమ్మా ప్రక్కగదిలో సూర్యం అన్నాయి నిద్ర పోతున్నాడు," అది మాలతి గొంతు. "ఎప్పుడో నిద్రపోయి వుంటాడు", కుమారి జవాబిచ్చింది. "ఏమే లలితా! అప్పుడే దుప్పటిలో దేహం దూర్చావు" కనకం లలితను నెట్టింది. "నిద్ర వస్తుందమ్మా" లలిత దుప్పటికి తలమీదికి ఈడ్చు కుంటూ అంది. "నిద్రవస్తుందా! లేక ఎవరైనా జ్ఞాపకంవస్తున్నారా?" కనకం నవ్వుతూ అడిగింది. దాంతో అందరూ గొల్లుమన్నారు.

ఇంతలో గదిలో యెవరో వచ్చినట్టు అలకిడి వినిపించింది "రండి! రండి! వధువుగారూ! దయచేయండి!" యెవరి వివాహం జరుగుతూ వుందో ఆ రాజ్యం కూడా గదిలో కొచ్చిందని సూర్యం గ్రహించాడు "మీరింకా నిద్రపోలేదా?" రాజ్యం అడిగింది. "ఈదినం నిద్రకూడా మా దగ్గరకు వస్తుందా?" కనకం జవాబిచ్చింది. "12 గంటలు కావస్తూందే యింకా యెందుకు నిద్రపో లేదు?" రాజ్యం అడిగింది, "నిజమేకాని మా పడకలమీద ముండ్లు గుచ్చుకుం టున్నాయి యెవరితోకూడ పడుకోమంటావు". అందరూ విరగబడి నవ్వడం మొదలు పెట్టారు, "చాల్లే నేర్చుకు పోయావు" రాజ్యంకసిరింది. "అందరూ వినండమ్మా నేను నేర్చుకున్నానంట! చెప్పమ్మా యింకేమేమి చెప్తావో!" కనకం ఏక్టింగ్ చేయ మొదలు పెట్టింది. అందరూచేరి "ఛిస్! ఛిస్! అంటూ నవ్వు కున్నారు, "నేను నేరక వచ్చా నమ్మా యిక్కడికి?" రాజ్యం విసుక్కుంది, సూర్యం అవలి గదిలో లోలోపలే నవ్వుకుం టున్నాడు. కనకం బలే చలాకీ పిల్లలాగుంటే ప్రతిదాన్నీ కొంచెంసేపట్లో గేలిచేసి తాటాకులు కట్టేస్తుంది.

"సరే నేను పోతున్నానమ్మా నీనోటికి యెవ రుతగుల్తారు" రాజ్యం అంది, "నోటికి తగ లడంకాదు, నోటిని అందియ్యాల మరొకరికి పెండ్లి కొడుక్కి...... " అంది కనకం. "భలే అన్నావు" అందుకుంది మాలతి. "మాతో మాట లాడితే పెండ్లికొడుకుతో మాట్లాడ్డానికి అలవా టవుతుంది" కుమారి హెచ్చరించింది

రాజ్యం వాళ్ళ బారినుండి తప్పించుకొని పారిపోవాలనే ప్రయత్నంలో వుంది. కాని యీ మూకింతా చుట్టుముట్టిపోనీవడంలేదు. కనకం అంటూ వుంది "చూడు రాజ్యం! నీవు పడక గదిలో ప్రవేసిస్తూనే పెండ్లికొడుకు నీతో "నమస్తే" అంటాడు నువ్వు మాట్లాడకూడదు. తర్వాత నీ దేహారోగ్యాన్ని గురించి వాకబు చేస్తాడు. తర్వాత తిన్నగా చెవివద్ద తలని ముఖం పట్టి "ఏమండీ! దేవిగారూ పలుకే బంగారమై పోయిందే" అని మంచితనం చేసికోవాలని చూస్తాడు కాని నువ్వుమాత్రం మూగనోము పట్టాలి అతని తియ్యని మాటలకు 'ఐస్‌క్రీమ్' అయిపోయి అంతలోనే లొంగిపోయేవు సుమా! జాగ్రత్త!" అంటూ హెచ్చరించింది. "సరే! యిక అర్థమైపోయిందిలే. నువ్వు చెప్పినట్లు చేస్తానో లేదో అనే అనుమానముంటే నాబదులు నువ్వే పోరాదు ముసుగేసుకొని" అందరూ "భేష్ భేష్" అంటూ చప్పట్లు కొట్టారు. కనకం కొంచెంసేపు వూరుకుంది.

సూర్యం ఇవతలనుంచి యెల్లాగైనా ఆగదిలో తొంగిచూడాలని ప్రయత్నిస్తున్నాడు వాళ్ళ సంభాషణంతా వింటున్నాడు కాని కండ్లతో చూడందే వాళ్ళ సంభాషణలోని మాధుర్యం అనుభవించలేకున్నాడు. తలుపులోని ఒక చిన్న రంధ్రం ద్వారా తన కోరిక నెరవేర్చుకున్నాడు. అందరూ చుట్టూ కూర్చొని వున్నారు. మధ్య రాజ్యంవుంది వీలు చూచుకొని రాజ్యం పోవాలని లేచింది. కనకం దాని కోక పట్టుకొని లాగుతూ "అరె. యిప్పుడే పోతావా? పెండ్లికొడుకు పడిలో కూర్చొని కబుర్లు చెప్పుకోవాలనే తొందర కాబోసు" "నిద్ర వస్తుందమ్మా" "రాత్రంతా మేల్కొని మేల్కొని మొగుడితో సరసాలాడేటప్పుడు నిద్ర రాదు కాబోలు" "యిప్పుడు పోనీయమ్మా నీపుణ్యముంటుంది తల పగిలిపోతూవుంది" "ఓహో! తలనొప్పి సాకుతో యిక్కడనుంచి వుడాయించాలనే పన్నాగమేనా! నాకీ ఆడపిల్లల దొంగ వేషాలన్నీ తెలుసునోయ్! అయినా నిన్నిపుడుక్షమించి వదలపెడుతున్నాము" అంటూ కనకం మహారాణి పోజులో పిల్చింది "నామీద మీరు చూపిన అపారమైన దయకు నేను ఆజన్మాంతం కృతజ్ఞురాల్ని" అంటూ రాజ్యం వంగి నమస్కరించి తుర్రున పారిపోయింది.

"మాటలలో సిగరెట్ల సమాచారమే మరచిపోయాం" కుమారి జ్ఞాపకం చేసింది. "సిగరెట్లు యెక్కడివి? లలిత ప్రశ్నార్థకంగా చూచింది. సూర్యం అన్నాయి ముఖం అటు త్రిప్పి నిద్రపోతున్నాడు వెనుకనే మెల్లిగాపోయి ఆయన తల దగ్గర వున్న టిన్ను తీసుకొని వచ్చేశాను" అంటూ మాలతి లలిత యొక్క సందేహం నివర్తి చేసింది. "తలా ఒక్కొక్కటి తీసుకొని వెలిగించండి" కనకం ఆజ్ఞాపించింది. ఇది వింటూనే సూర్యం తన పడకలో వెతికాడు సిగరెట్ల నిండు టిన్ను మాయమైవుంది. మరల కుర్చీలో కూర్చొని తలుపు సందులోనుంచి చూస్తున్నాడు.

గదిలో సిగరెట్లన్నీ ఒక్కమారుగా వెలిగించబడ్డాయి. గది నిండా దగ్గు తెర కమ్ముకుంది. యెవరో వూరికే తెగవుమ్ముతూంది యింకొకతె కొత్తమేళం కాబోలు గొంతును సవరించుకుంటూంది. కాని కనకం చాలా నెమ్మదిగా దమ్ముమీద దమ్ము పీల్చేస్తున్నది. ఒక్కొక్కప్పుడు సీత ముఖంమీద మరొకప్పుడు లలిత చెవులోను పొగ వదులుతూంది. వారిద్దరూ ఆపొగను భరించలేక ముఖానికి గుడ్డ అడ్డం పెట్టుకుంటున్నారు.

"పొగంటే యింత భయపడుతున్నావే! నీ ప్రియుడు వదలితే సంతోషిస్తావుకదూ" అంటూ కనకం కన్ను గీటింది. "అంతటి ధైర్యమూ నామీద పొగ వదిలేందుకు" లలితఅంది "అందరూ ప్రియురాళ్లు సంతోషించేటప్పుడు నీ వొక్కతెవే పైనుంచి వూడిపడ్డావా?" కనకం అడిగింది. "నీప్రియుడు నీతో యిలాగే సరసాలాడుతాడు కాబోలు" లలిత హెచ్చరించింది, "నా ప్రియుడెప్పుడూ యిలాటి సరసాలాడలేదు. మా కాలేజి

కుర్రాడు వకడు ప్రయత్నించి వెకిలిచేష్టలుచేశాడు కాని వక్క చెంపపెట్టుతో చిన్నప్పుడు త్రాగిన తల్లిపాలు జ్ఞాపకం వచ్చింది కాబోలు అంతే తోక ముడిచాడు. "పాపం ఒకరి మనస్సు నొప్పించడం పాపంకదూ" సీత విచారం వెలిపుచ్చింది. "అవును యితరులను సంతోషపెట్టేందుకు మనం మూర్ఖులమై చీకటి వంటింట్లోను స్నానాల గదుల లోను దొడ్డిలోని జామిచెట్టుక్రింద కాచుకుని వుండాలా? తీరా కలిసాక ఎవరికన్నైనాపడి పోతే విచారంతో నిడిపోడం యిదేనా ప్రేమ. యిల్లాంటి ప్రేమను నే నంగీకరించను. సరే మీరు వక్కక్కరుగా మీ ప్రేమానుభవాలు వినిపించండి చూతాం!" కనకం ఆజ్ఞాపించింది. "యెవరైనా వింటే" మాలతి భయం వెలిపుచ్చింది. "మీఅనుభవాలు వినేందుకు ప్రపంచమంతా యీ సగం రాత్రిలో మేల్కొని వుంటుందంటావు?" కనకం ధైర్యమిచ్చింది. "అదేంటి అలాగంటావు వక వేళ సూర్యం అన్నాయి వింటే" మాలతికి మరో సందేహం "ఆయన నిద్రపోతూవుంటాడు నిద్ర మేల్కొని మన మాటలను రహస్యంగా వినేంతటి మూర్ఖుడు కాడనుకుంటాను" కనకం అనేసింది. సూర్యం ఆమాట విని కుర్చీలో నిశ్శబ్దంగా అలాగే కూర్చుండిపోయాడు.

"నా మేనత్త కొడుకు నన్ను ప్రేమిస్తున్నానని మా యింటికి వస్తూపోతూ మొదటిరోజు నా చేతిమీద గిల్లాడు. రెండోరోజు బలవంతంగా ముద్దుకూడ పెట్టాడు.. మాలతి సిగ్గుతో తన ముఖం చేతులలో దాచుకుంది. "తర్వాతనువ్వు?" కనకం కుమారివైపు వేలు చూపించి" మొదట అలాగే ప్రారంభించాం కాని త్వరలో మే మిద్దరు పట్టుబడిపోయి దాని ఫలితం వివాహంవరకూ వచ్చింది" "సరే నువ్వు" కనకం సీతతో అంది మొదట అతడు ఎంతో శ్రద్ధతో పురిముట్టడం మొదలెట్టాడు. నేనేం అర్థం చేసుకోలేకపోయాను. నేనూకూడా చేయి కలిపాను తర్వాత తెలుసుకున్నాను, మా యిద్దరికీ ప్రేమ యిప్పుడే ఆరంభిస్తూందని. తర్వాత వస్తూ పోతూ శరీరంలోని ఒకభాగం ప్రమాదవశం గావించుకుంది. తర్వాత హృదయాలు కలిసాయి, ఆపైన పెదిమలుకూడా." సీత తల వంచేసుకుంది. "లలితా యిప్పుడు నీవంతు" కనకం ఆజ్ఞాపించింది- "నావిషయంలో తలగొరిగిందే వడగండ్లుకురిశాయి- యెవరైతే నన్ను మొట్టమొదట ప్రేమించానని దగ్గర చేరారో ఆయనకు మరొకామెతో పెండ్లి చేసేశారు- అప్పటినుంచి యిక్కడ నాప్రేమంతా యెండిపోయింది" అది వింటూనే అందరూ విరగబడి నవ్వడం మొదలెట్టారు- "ఇప్పుడు నీవు చెప్పవోయ్" అందరూ కనకాన్ని చుట్టుముట్టారు 'ఇంతవరకు నేను యెవ్వరినీ యిష్టపడనందున ప్రేమించేందుకు అవకాశమే లేకుండా పోయింది" యిదివిని అందరూ నోటిలో గుడ్డలు కుక్కుకొని నవ్వను మొదలెట్టారు- కనకం తన సిగరెట్టు కడపటి పీల్పు పీల్చుతూవుంది-

"వినండమ్మా యిక్కడేదో శబ్దం వస్తూంది అంటూ సీత సూర్యం గదివైపు చూపింది- సూర్యం వెంటనే కంగారుతో పోయి తన పడకమీద పడుకొని ముసుగు బిగించాడు, యెక్కడ పట్టుపడుతాననే భయంతో- లలిత సూర్యం గదిలో తొంగిచూచి వచ్చి కనకం చెవిలో యేదో గుసగుసలాడింది- కనకం బిగ్గరిగా "మామాటలు రహస్యంగాదాగి దొంగలాగు వినేవాడొక భీరువు. నిజంగా మగవాడైతే ఎదురుగా రమ్మను" తర్వాత గదంతా "ఛీ! ఛీ! ఖా! ఖా!" అంటూ నవ్వుతో నిండిపోయింది. అంతటితో మళ్ళీ కార్యక్రమం సమాప్తమైంది-

సూర్యం నిద్రపో దలచాడు కాని యెంతకూ నిద్ర రావడంలేదు- నిద్ర ముంచుకొచ్చేటప్పుడు ఆపిల్లల గలభాతో నిద్ర తేలిపోయింది- వాళ్ళ ఒకొక్కొక్కమాట జ్ఞాపకం వచ్చి అనుకున్నాడు- యీ ఆడపిల్లలంతా పైకి మంచేందుకు యెంతో సిగ్గున్న యెంతో అమాయకుల్లాగు కనుపిస్తారు కాని వీళ్ళందరికీ కడుపులో ఉంటాలున్నాయి- వీళ్ళందరూ పైకి కనపడని పంబల్ మాసులు.... యీ ఆలోచనతో యెప్పుడో నిద్ర పట్టిపోయింది,